క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణులకు కేటాయించండి


శంకరాచారి

చేర్యాల(సిద్దిపేట): ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ పదవి విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాత్య సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్జోజు శంకరాచారి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షలకు పైగా ఉన్న విశ్వ బ్రాహ్మణులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. నిత్య జీవితంలో ఏ పనిముట్టు తయారు కావాలన్నా విశ్వబ్రాహ్మణులు అవసరమని చెప్పారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాగేశ్వరరావు, చంటి, వెంకట్‌రెడ్డి, అంజయ్య, తిరుపతిగౌడ్, యాదగిరి, ఇన్నారెడ్డి, సిద్ధిరాములుగౌడ్, మానస, ఐలయ్య, మధు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ధ్యేయం


మహిళలతో మాట్లాడుతున్న శశాంత్

హుస్నాబాద్‌రూరల్: స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దడానికి స్వశక్తి మహిళలు ముందుకు రావాలని స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధి శశాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్ గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంత్ మాట్లాడుతూ తడి, పొడిచెత్తను వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహన సిబ్బందికి అందించాలన్నారు. చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసుకొని మొక్కలు, పంటల సాగుకు వినియోగించుకుంటే రసాయన ఎరువుల కొనుగోలు తప్పుతుందని సూచించారు. చెత్తను ఆరుబైట పడవేయవద్దని కోరారు. సమావేశంలో సీసీ అపర్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ఎస్‌ఐ


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్‌ఐ ప్రశాంత్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని బస్ షెల్టర్ సమీపంలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో కొన్ని రోజులుగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం ఆయన గుంతలు పడిన చోట మట్టి నింపించి పూడ్పించారు. వాహనదారులు, స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

23న విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న రాజురెడ్డి

దుబ్బాక: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 23న వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు రాజురెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బాకలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో వారంతా ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 23న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, మేధావులు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. జాన్‌రెడ్డి, రాజురెడ్డి, శివకుమార్, భాను, పవన్, అమూల్య, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

బోనం.. అంగరంగ వైభవం

ఆషాఢమాస బోనాల ఉత్సవాలు గ్రామాలలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కాళికమ్మ, ముత్యాలమ్మ తదితర అమ్మవార్లకు మహిళలు బోనాలెత్తారు. ప్రత్యేకంగా అలంకరించిన బోనం కుండలతో, సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతరాజులు, శివసత్తుల విన్యాసాలతో గ్రామాలలో జాతర శోభ సంతరించుకుంది.


మర్కూక్(గజ్వేల్): అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న గంగాపూర్ గ్రామస్తులు


కోహెడలో పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో పద్మశాలి మహిళలు


వర్గల్(గజ్వేల్): గిర్మాపూర్‌లో పోతరాజుల విన్యాసం

సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు


బోనం ఎత్తుకున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: బోనాల ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆషాఢమాసంలో జరిగే బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. పల్లె నుంచి పట్నం వరకు ప్రతి వాడలో అమ్మవార్లకు బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ప్రజలందరిపై గ్రామదేవతల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, కొండపోచమ్మ దేవాలయ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, నాయకులు గుంటుకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేట(హుస్నాబాద్): కట్కూర్‌లో బోనాలతో తరలి వస్తున్న మహిళలు


బెజ్జంకి(సిద్దిపేట): గుండారంలో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు


హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో గ్రామ దేవతకు నైవేద్యం

కేసీఆర్ హయాంలోనే వైభవం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కేసీఆర్ హయాంలోనే సర్వమతాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి వైభవంగా పండుగలు జరుపుకునేలా చేశారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతారంలో ఆదివారం బోనాల ఉత్సవాల్లో పాల్గొని మహంకాళమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయతో నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు.


ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కిషన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం : జేఏసీ నాయకులు


పోలీస్‌బొమ్మ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే బంద్‌కు పిలుపునిస్తున్నట్లు చేర్యాల రెవెన్యూ డివిజన్ సధన కమిటీ జేఏసీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో జేఏసీ నాయకులు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి ఘనచరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతం అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటుందన్నారు. బలమైన రాజకీయ నాయకత్వం లేకపోవడమే అందుకు కారణమని, పూర్వవైభవం కోసం అందరి సహకారంతో రెవెన్యూ డివిజన్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 25న చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, బీరయ్య, సిద్ధియ్య, నారాయణ, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

రూరల్ సీఐ శ్రీను

బెజ్జంకి(సిద్దిపేట): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం గుండారం గ్రామంలోని పోచమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో నెలకొన్న వివాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బోనాల ఉత్సవాలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. త్వరలో శాశ్వత పరిష్కారం చేస్తామని చెప్పారు. కార్యక్రమాలలో ఎస్‌ఐ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.


స్టేషన్ ఆవరణలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

రైతులు విద్యుత్ పనులు చేయవద్దు

విద్యుత్‌శాఖ ఏఈ సాయికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): ట్రాన్స్‌ఫార్మర్లవద్ద విద్యుత్ సమస్యలుంటే రైతులు సొంత మరమ్మతులు చేయవద్దని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ సాయికుమార్ అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం వరినాట్ల సీజన్ ఉండటంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లవద్ద, విద్యుత్ స్థంభాలు, లైన్లవద్ద ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి స్థానిక లైన్‌మెన్, ఏఈలతో మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ


కారును సోదా చేస్తున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి- కల్లెపెల్లి రోడ్డుపై ఎస్‌ఐ సౌజన్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యం చేరుకుంటారన్నారు. మద్యం నడిపి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సత్యసాయి సేవలు ఎనలేనివి: యాదవరెడ్డి


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

గజ్వేల్‌రూరల్: భగవాన్ సత్యసాయిబాబా సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం జరిగిన దేవతామూర్తుల కల్యాణోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తాగునీరు, వైద్యం అందించేందుకు సత్యసాయిబాబా చేపట్టిన సేవ కార్యక్రమాలు మరువలేనివన్నారు. సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన భోజనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలలో స్థిర పడ్డ ఆ కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటమితో నిరాశ చెందొద్దు


విజేతలతో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు

క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్

గజ్వేల్‌రూరల్: క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ ఇన్విటేషన్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ద్వితీయ స్థానంలో ప్రజ్ఞాపూర్, తృతీయ స్థానంలో అహ్మదీపూర్ పాఠశాలల జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు విజయరేఖ, సెక్రెటరీ గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు నవీన్, నరేశ్‌కుమార్, పీడీ రాజిరెడ్డి, నాగేశ్, ప్రశాంత్, పోచయ్య, సంతోష్, రెఫరీలు ప్రభు, నర్సింహులు, భాను తదితరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం

కొండపాక(గజ్వేల్): కొండపాక సత్యసాయి కళాశాల సమీపంలో ఆదివారం సాయిగౌరీ గోశాలను యాంటీ కరప్షన్ బ్యూరో రిటైర్డు జాయింట్ డైరెక్టర్ సంపత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ హాజరై మాట్లాడారు. గో సేవ మాధవ సేవతో సమానమన్నారు. యువత గో సేవ కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు.

గంజాయి రవాణాను అరికట్టండి

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలో గంజాయి రవాణాను అరికట్టేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ఇటీవల అత్తను బీమా డబ్బుల కోసం అల్లుడు హత్య చేసిన కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి వారికి రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి మత్తుకు, జల్సాలకు అలవాటు పడిన కొందరు మానవత్వం మర్చి హత్యలు చేస్తున్నారన్నారు. డబ్బుల కోసం అత్తను హతమార్చిన అల్లుడు జైలుకు వెళ్లడంతో ఆ కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబ సభ్యులకు తన వంతు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట మహేందర్, గ్యాదారి మధు, గయాజొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అత్తు ఇమామ్

కల్వర్టు నిర్మించండి మహాప్రభో..


దుబ్బాక-మల్లాయపల్లి మధ్యన తెగిన రోడ్డు(ఫైల్)

- ఇటీవలే మల్లన్నసాగర్ కెనాల్ తెగి కొట్టుకుపోయిన రోడ్డు
- మళ్లీ భయపెడుతున్న వర్షాలు
- ఆందోళనలో మల్లాయపల్లి గ్రామస్తులు

దుబ్బాక: దుబ్బాక -మల్లాయపల్లి మధ్య ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు. గత ఎండకాలంలో మల్లన్నసాగర్ కెనాల్ తెగి పొంగి ప్రవహించిన వరదనీటి ధాటికి దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయపల్లి శివారులో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రెండు రోజులపాటు మల్లాయపల్లి-దుబ్బాక మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా కొట్టుకపోయిన ఆ రోడ్డుపై మట్టిని పోసి వదిలిపెట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో చిన్నవానలకే పోసిన మట్టి కొట్టుకుపోయి రోడ్డు కోతకు గురవుతోంది. భారీ వర్షం కురిస్తే మళ్లీ రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొట్టుకుపోయిన రోడ్డు వద్ద కల్వర్టు నిర్మించాలని, తమ రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.


కోతకు గురవుతున్న మల్లాయపల్లి రహదారి

రోడ్లకు గుంతలు.. తప్పని తిప్పలు

- రాళ్లుతేలిన రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు పంచాయతీరాజ్ రోడ్లు వేశారు. కానీ ప్రస్తుతం ఆ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉంది. కొన్ని గ్రామాలకు ఆర్అండ్‌బీ రోడ్లు ఉండగా, మరికొన్ని గ్రామాలకు పంచాయతీరాజ్ రోడ్ల వేశారు. అయితే కొన్నేళ్ల క్రితం మట్టి రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు నిర్మించారు. వట్టిపల్లి నుంచి మందాపూర్ మీదుగా జగదేవ్‌పూర్ వరకు, అలాగే జగదేవ్‌పూర్ నుంచి ఇటిక్యాల మీదుగా కర్కపట్ల వరకు, తిగుల్ నుంచి అలిరాజ్‌పేట మీదుగా ఇటిక్యాల తదితర గ్రామాలకు పంచాయతీరాజ్ రోడ్ల సౌకర్యం ఉంది.

రోడ్లు గుంతలమయం

మండలంలోని వట్టిపల్లి నుంచి మందాపూర్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. జగదేవ్‌పూర్ నుంచి కర్కపట్ల వరకు వెళ్లే రోడ్డు తారు లేచిపోవడం, చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చాట్లపల్లి నుంచి సాల్వపూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసంగా మారింది. గొల్లపల్లి నుంచి బిజివెంటాపూర్ వరకు రోడ్డు కంకర తేలింది. అలిరాజ్‌పేట నుంచి బిజివెంకటాపూర్ రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు.


ధ్వంసమైన వట్టిపల్లి- మందాపూర్ వెళ్లే రోడ్డు

ప్రతిపాదనలు పంపించాం..

"మండలంలోని పంచాయతీరాజ్ రోడ్ల పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. విడతల వారీగా మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మొదటి విడతలో కొన్ని రోడ్లను గుర్తించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం."
– రాకేశ్, పీఆర్, ఏఈ, జగదేవ్‌పూర్